
సాక్షి
బాపట్ల
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 32,115 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 51,069 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4012 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1395 క్యూసెక్కులు వదిలారు.



దుర్గమ్మ సేవలో కర్ణాటక మంత్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కర్ణాటక రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

గుండ్లకమ్మపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలం అందుగుల-కొత్తపాలెం వద్ద గుండ్లకమ్మ నదిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా 700 కిలోమీటర్ల రోడ్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 100 కిలోమీటర్లపైగా రోడ్లు నిర్మాణానికి అంచనాలు వేశామన్నారు. కోఆపరేటివ్ సొసైటీల ద్వారా అనేక రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ రూ.15.83 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జిలు నిర్మించడం వల్ల చుట్టుపక్కల ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, కూటమి నాయకులు వంకాయలపాటి పేరయ్య, ముంద్రు సుబ్బారావు, గంగినేని ఆంజనేయులు, మాదినేని ఆంజనేయులు, గంగినేని బాబు, అధికారులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. తాడేపల్లి మండలంలో 6.8 మిల్లీ మీటర్లు, మంగళగిరి 5, కొల్లిపర 3.2, గుంటూరు తూర్పు 1.6, గుంటూరు పశ్చిమ 1.6, పొన్నూరు మండలంలో 0.6 మి.మీ. చొప్పున కురిసింది.

జెడ్పీ డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ డిప్యూటీ సీఈవోగా సీహెచ్ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా డ్వామా ఏపీడీగా ఉన్న కృష్ణ ఇటీవల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహించిన రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిప్యూటీ సీఈవోగా పని చేసిన జె.మోహన్‌రావు నెల్లూరుకు బదిలీ అయ్యారు.

జీడీసీసీ బ్యాంకు పునర్ వైభవానికి కృషి చేయాలి

గుంటూరు వెస్ట్: జీడీసీసీ బ్యాంకు పునర్ వైభవానికి సమష్టి కృషి అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పంట రుణాలకు సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. మొండి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు.

నగర అదనపు కమిషనర్‌గా ఓబులేసు బాధ్యతల స్వీకరణ



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా చల్లా ఓబులేసు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న రాజ్య లక్ష్మిని తన మాతృశాఖ అయిన రెవెన్యూ శాఖకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఓబులేసును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

కోటప్పకొండ ఈవో బాధ్యతల స్వీకారం



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈఓగా దాసరి చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందజేసిన అనంతరం ఈఓ బాధ్యతలు స్వీకరించారు.

ఖేల్.. జిగేల్

ఖోఖోలో ప్రత్యర్థుల్ని టచ్ చేయాలంటే పంగులూరు క్రీడాకారులకే సాధ్యం. రాకెట్‌లా దూసుకుపోతూ చిరుతల్లా చెలరేగుతారు. ఎదుటివారికి దొరకకుండా ఆడాలన్నావారికే సాధ్యం. అందుకే ఈ గడ్డపై పుట్టిన ఎందరో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పలువురు ఖోఖో క్రీడాభిమానులు ఆట నేర్చుకొనేందుకు పంగులూరు వస్తున్నారు.

- ఖోఖోకు పుట్టిల్లు పంగులూరు
- అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- గ్రామంలోని ఎస్ఆర్ఆర్ అకాడమీలో ఉత్తమ శిక్షణ
- ఐదుగురికి అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు
- స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల సాధన

జే.పంగులూరు: రాష్ట్రంలో ఖోఖో పేరు వినగానే పంగులూరు గుర్తుకు వస్తుంది. అంతర్జాతీయస్థాయి క్రీడాకారులకు నెలవైన ఈ గ్రామం జిల్లా ప్రతిష్టను కీర్తికెక్కించింది. ప్రభుత్వం చేయూత లేకపోయినా గ్రామస్తులు క్రీడాకారులకు ఆర్థికంగా, మానసికంగా అండగా ఉంటున్నారు. 1992లో మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆట ప్రస్థానం మొదలైంది. భవన నిర్మాణ దాత బాచిన వెంకట్రావు, కుటుంబ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీని ప్రారంభించారు. ఇప్పటి దాకా 176 కోచింగ్ క్యాంపులు నిర్వహించి, ఎంతో మంది క్రీడాకారుల్ని తీర్చిదిద్దింది. పంగులూరులో ఖోఖో అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన చెంచు గరటయ్య సహకారం మరువలేనిది. అకాడమీలో క్రీడాకారులకు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇస్తారు. రాష్ట్రస్థాయిలో పంగులూరు జట్టు గుర్తింపులో వ్యాయామ ఉపాధ్యాయుడు సీతారామిరెడ్డి కృషి ఎంతో ఉంది. ప్రస్తుతం ఖోఖో క్రీడాకారులకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తోడ్పాటునందిస్తున్నారు.

పలువురికి క్రీడా కోటాలో ఉద్యోగాలు

క్రీడా కోటాలో ఎస్ఐలు, సీఐలుగా పలువురు పని చేస్తున్నారు. కానిస్టేబుళ్లగా 25 మంది సేవలందిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా 30 మంది, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో 20 మంది, ఆర్మీలో సుమారు 25 మంది, అమెరికాలో ఐదుగురు, స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్, ఎంసీఏ, ఎంబీఏలు, మెడికల్ చేసినవారు సుమారు 50 మంది ఉన్నారు.

జాతీయ క్రీడల్లో ..

కాశీవిశ్వనాథరెడ్డి (బంగారు పతకం) జొన్నలగడ్డ పొలు (బ్రాంజ్) కంది వెంకటరెడ్డి (బ్రాంజ్) రావూరి శ్రీనివాసరావు (బ్రాంజ్) పాలకీర్తి శ్రీను(బ్రాంజ్) పోతిరెడ్డి శివారెడ్డి (బ్రాంజ్ మెడల్) మండవ సౌజన్య (బంగారు పతకం)



అంతర్జాతీయ స్థాయిలో అడుతున్న శివారెడ్డి

గ్రామీణ క్రీడల్లోనూ సత్తా

పంగలూరుకు చెందిన మేకా వెంకటేశ్వర్లు, గుడిపూడి బాలకృష్ణ, నరేంద్ర, విజయభాస్కర్‌రెడ్డి, కుంభా నాగరాజు, శ్రీకాంత్ బంగారు పతకాలు సాధించారు.



అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో అడుతున్న క్రీడాకారులు

సంతోషంగా ఉంది



మాది విజయనగరం జిల్లా, గరుగు బిల్లా గ్రామం. 2020లో ఇంటర్ మీడియట్ పంగులూరు జూనియర్ కళాశాలలో క్రీడల మీద ఆసక్తితో చేరాను. సీతారామిరెడ్డి పర్యవేక్షణతో ఖోఖోలో మెళుకువలు నేర్చుకొన్నాను. 2021 జూనియర్ నేషనల్ ఒడిశాలో, 2022లో ఖేల్ ఇండియా హరియాణా, 2023లో సీనియర్ జాతీయస్థాయి పోటీలు ఆడాను. 2024లో అంతర్జాతీయ ఖోఖో ఆడి బంగారు పతకం సాధించాను. పంగులూరులో ఖోఖో నేర్చుకోవడం వల్ల నా జీవితం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ఇండియన్ పోస్టల్‌లో ఉద్యోగ అవకాశం వచ్చింది.

– రేజేటి సూరినాయుడు, క్రీడాకారుడు

లండన్‌లో గోల్డ్‌మెడల్



నాకు ఖోఖో మీద ఉన్న ఆసక్తితో తల్లిదండ్రులు నన్ను పంగులూరులో నేర్చుకోమని పంపారు. 2006 నుంచి నేను ఆడటం ప్రారంభించాను. ఇప్పటికి మూడు సార్లు జూనియర్, తొమ్మిది సార్లు సీనియర్ జాతీయస్థాయి ఖోఖో ఆడాను. అంతర్జాతీయ స్థాయిలో 2018లో లండన్‌లో, అదే సంవత్సరం రాజస్థాన్‌లో నేపాల్‌తో ఆడి బంగారు పతకాలు సాధించాను. ప్రస్తుతం ఇండియన్ పోస్టల్ అదిలాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నా.

– పోతిరెడ్డి శివారెడ్డి, ఇండియన్ పోస్టల్ ఉద్యోగి

రైల్వేస్‌లో ఉద్యోగం సాధించా



పంగులూరులో ఖోఖో నేర్చుకొని నేను ఇంతటి వాడిని అయ్యాను. మా గురువు సీతారామిరెడ్డి మాకు ఎప్పుడు చేదోడువాదోడుగా ఉంటారు. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో ఆట ఆడటం వల్ల ఇండియన్ రైల్వేలో జాబ్ సంపాదించగలిగా. నేను ప్రస్తుతం మహారాష్ట్రలోని నాందెడ్‌లో పని చేస్తున్నాను.

– పాలకీర్తి శ్రీను

రైల్వేలో టీసీగా ఉద్యోగం



నేను సబ్ జూనియర్ జాతీయ స్థాయిలో రెండు సార్లు, సీనియర్ విభాగంలో ఐదు సార్లు ఆడాను. అంతర్జాతీయ స్థాయిలో 2023లో అస్సాంలోని తమ్మలపూర్‌లో నేపాల్, భూటాన్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, ఇరాన్, సౌత్ కోరియా, నార్త్ కొరియా టీములతో జరిగిన పోటీల్లో ఇండియా తరపున ఆడి బంగారు పతకం సాధించా. ప్రస్తుతం రైల్వేలో టీసీగా పని చేస్తున్నాను.

– అట్ల శివనాగిరెడ్డి, పంగులూరు

అంతర్జాతీయ పోటీలే లక్ష్యం



పంగులూరులో అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహి ంచాన్నదే నా లక్ష్యం. ఇప్పటిదాకా గ్రామంలో రాష్ట, జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించారు. ఖోఖో ఇండియన్ ఫెడరేషన్ అధికారులు నిర్వహణ చూసి ఆశ్చర్యపోయారు. అంతర్జాతీయ పోటీలను పంగులూరులో నిర్వహించాలని వారే కోరారు. భవిష్యత్‌లో తప్పక నిర్వహిస్తాం.

– బాచిన చెంచుగరటయ్య, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్

గ్రామస్తుల సహకారం మరువలేనిది



పంగులూరులో క్రీడను మొదలు పెట్టి 32 సంవత్సరాలు అయ్యింది. ఇంతకాలం నిర్విరామంగా కొనసాగుతోందంటే అది గ్రామస్తుల తోడ్పాటు, డాక్టర్ బాచిన చెంచు గరటయ్య అండదండలు. పంగులూరులో నేర్చుకున్న క్రీడాకారులు ఐదుగురు అంతర్జాతీయ స్థాయిలో ఆడటం సంతోషంగా ఉంది.

– మేకల సీతారామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో కార్యదర్శి

నా జీవితాన్ని మార్చేసింది



1992లో పూసపాడులో సీతారామిరెడ్డి ద్వారా ఖోఖో నేర్చుకున్నాను. 1995లో జూనియర్ నేషనల్ ఆడాను. 1997లో మణిపూర్ ఇంఫాల్ సీనియర్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాను. 1997లో అంతర్జాతీయ స్థాయిలో కలకత్తాలో ఆడాను. ప్రస్తుతం పీఈటీగా పని చేస్తున్నాను.

– భవనం కాశీవిశ్వనాథరెడ్డి, ప్రకాశం జిల్లా ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న జేసీ ఎ.భార్గవ్ తేజ

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ద్వారా రైతులకు విశిష్ట సేవలు అందించాలని జీడీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ సూచించారు. జీడీసీఎంఎస్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా (పీఏసీఎస్)లకు పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపారు. కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో మహాజన సభ సమావేశం జేసీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత 2022-23 ఆడిట్ రిపోర్టు, 2023-24 జమ ఖర్చులను బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సభ ముందు ఉంచారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ.. సహకార రంగంలో నూతన అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందించాలన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు, సంఘాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే జీడీసీఎంఎస్‌ను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, నోటు పుస్తకాలు, స్టేషనరీ అండ్ ప్రొవిజన్స్ ద్వారా రూ.23.75 కోట్ల వ్యాపారం చేసినట్లు పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.10 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు తెలిపారు. అనంతరం పలు తీర్మానాలు ప్రవేశ పెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో జీడీసీఎంఎస్ కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, జిల్లాలోని పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న విజయనిర్మల

మార్టూరు: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు, ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల అన్నారు. మండలం రైతు సంఘం ఆధ్వర్యంలో బొల్లాపల్లిలో శుక్రవారం రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. రైతులు సాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లు అయిన జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. సూక్ష్మజీవులు కూడా వృద్ధి చెందుతాయని చెప్పారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం 120 రోజుల కాలపరిమితి కలిగిన వరి వంగడాలైన ఎన్ఎల్ఆర్-34449, ఎన్ఎల్ఆర్-3354, జేసీఎల్-384 సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ వంగడాలు దోమకాటును తట్టుకోవడమే కాకుండా మెడ విరుపు లేకపోవడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. విత్తనాలు వెద పద్ధతిలో నాటడం వల్ల నారుమడుల కోసం వెచ్చించే రూ. 8000ను రైతులు ఆదా చేసుకోవచ్చని చెప్పారు. లాం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు వరి, మొక్కజొన్న పంటలు, మార్కెట్ ఇంటెలిజెన్స్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ఉష, మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో వి. కిరణ్ కుమార్ మాట్లాడారు. రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, బత్తుల హనుమంతరావు, బొల్లాపల్లి. కోలలపూడి పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో మిన్నంటిన రోదనలు

మృతదేహాల వద్ద శోక సంద్రంలో బంధువులు



మార్కు మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు




మార్కు (ఫైల్)

జే.పంగులూరు: ''అత్తమ్మను హాస్పిటల్లో చూపించుకొని వెంటనే తిరిగి వస్తామని వెళ్లావు.. ఇలా శవంలా వస్తావని అనుకోలేదు నాయనా'' అంటూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కురగంటి మార్కు తాత్తయ్య నల్లయ్య, నాయనమ్మ వెంకాయమ్మలు భోరున విలపించారు. మనవడి కోసం ఆ వృద్ధ దంపతులు రోదనలతో కాలనీవాసులంతా తల్లడిల్లిపోయారు. కృష్ణా జిల్లా గన్నవరం దగ్గర బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని కల్లంవారిపాలేనికి చెందిన కురగంటి మార్కు, కొండమూరు గ్రామానికి చెందిన పోలిపోగు మేరిమ్మ, కోటపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు ప్రేమమ్మ మృతదేహాలు గురువారం రాత్రి స్వగ్రామాలకు చేరాయి. దీంతో మూడు గ్రామాల్లోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. కల్లంవారిపాలెంలోని కురగంటి మార్కు ఇంటి ఇంటి వద్ద బంధువులు విషాదంలో మునిగిపోయారు. పది రోజుల కిందట కుమారుడి మొదటి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నాడని, అందరినీ పిలుచుకొని భోజనాలు పెట్టాడంటూ తలుచుకుని ఏడుస్తున్నారు. ''మా అమ్మను కాపాడబోయి నువ్వు కూడా వెళ్లిపోయావా.. మేం ఎలా బతకాలని? '' మార్కు భార్య ముకన్య గుండెలవిసెలా రోదిస్తోంది. ఒక వైపు తల్లిని మరో వైపు భర్తను కోల్పోవడంతో పాటు తండ్రి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో ఉండటంతో ముకన్య బాధ వర్ణనాతీతంగా ఉంది. కుమారుడు చనిపోయిన బాధతో మార్కు తండ్రి ఏలేసు ఎవరితోను మాట్లాడకుండా ఒక వైపు కూర్చుండిపోయాడు. కోటపాడులో ప్రేమమ్మ మృతదేహం దగ్గర, కొండమూరు గ్రామంలో మేరిమ్మ మృతదేహం దగ్గర బంధువులు భోరున విలపిస్తున్నారు. శుక్రవారం ముగ్గురు మృతదేహాలకు అంత్యక్రియలు జరిగాయి.

జిల్లాలో పర్యాటకం అభివృద్ధికి చర్యలు

జేసీ ప్రఖర్ జైన్




సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

బాపట్ల: జిల్లాలో పర్యాటకం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఈ ఏడాది 'పర్యాటకం-శాంతి' అనే నినాదంతో వేడుకలు నిర్వహించననున్నట్లు చెప్పారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి రూ.100 కోట్లు రానున్నాయని వెల్లడించారు. వీటితో బీచ్‌ల వద్ద పర్యాటకులు నాలుగైదు రోజుల పాటు ఉండేలా అన్ని వనరులు సమకూరుతాయని తెలిపారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణం, వసతి సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. పర్యాటక దినోత్సవంలో భాగంగా బాపట్ల జిల్లాలోని బీచ్‌లన్నీ తెరిచామని, పర్యాటకులు నిరభ్యంతరంగా రావచ్చని తెలిపారు. ప్రతి వంద మీటర్లకు ఒక గజ ఈతగాడు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. బాపట్ల జిల్లాలోని బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ స్థాయి రానుందని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతంగా ప్రత్యేక గుర్తింపు లభించడానికి రెండో దశ పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందుతాయని పేర్కొన్నారు. పర్యాటకుల కోసం బీచ్‌ల వద్ద కుర్చీలు, టేబుల్స్‌ను రిసార్ట్స్, హోటళ్ల యజమానులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. బీచ్‌ల వద్ద పబ్లిక్ మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని జేసీని రిసార్ట్స్, హోటళ్ల యజమానులు కోరారు. భోజన హోటళ్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని, గజ ఈతగాళ్లకు పంచాయతీల నుంచి వేతనం చెల్లింపులు జరిగేలా చూడాలని తెలిపారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, రాయితీలు కల్పించాలని విన్నవించారు. సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పి. సురేష్, రిసార్ట్స్, హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

విధాన మార్పులపై అవగాహన అవసరం

-జెడ్పీ సీఈవో జ్యోతిబసు



మాట్లాడుతున్న జ్యోతిబసు

గుంటూరు ఎడ్యుకేషన్: పంచాయతీ రాజ్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలకు పంచాయతీ రాజ్ చట్టం, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2024-25పై మూడు రోజులపాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు మార్పులపై అవగాహన పొంది, గ్రామస్థాయి వరకు వాటిని అమలు చేసేలా చూడాలని సూచించారు. డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ.. శిక్షణలో తెలుసుకున్న అంశాలతో కిందిస్థాయి వరకు పరిపాలన సవ్యంగా సాగేలా చూడాలని సూచించారు. పర్యవేక్షకుడు మోహన్ మాట్లాడుతూ.. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఎస్డీజీ అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ మేనేజర్ కె.నాగేశ్వరరావు, జిల్లా రీసోర్స్ పర్సన్లు ఎస్. నిరంజన్‌రావు, షేక్ కరీముద్దీన్, కె.అనూరాధ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్చక సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాసమూర్తి



బాపట్ల టౌన్: జిల్లా అర్చక సేవా సంఘం కన్వీనర్‌గా మేడూరు శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. బాపట్లలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన్ను ఎంపిక చేశారు. అర్చకుల సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీనివాసమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణ వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శి రామలింగేశ్వరశాస్త్రి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, బాపట్ల జిల్లా అధ్యక్షులు స్వర్ణ రాఘవశర్మ, ప్రధాన కార్యదర్శి బృందావనం గోపీచంద్, ఉపాధ్యక్షులు శ్రీనివాసాచార్యులు, గౌరవాధ్యక్షులు పాంచజన్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినుకొండ సత్యంబాబు, కోశాధికారి అనంత చక్రవర్తి పాల్గొన్నారు.

3న భట్టిప్రోలులో చేనేత మహాసభ



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభను భట్టిప్రోలులోని రథం సెంటర్‌లోని రైలుపేట సొసైటీ మగ్గాల షెడ్డులో అక్టోబర్ 3న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యుడు దీపాల సత్యనారాయణ, జిల్లా కమిటీ నాయకుడు మురుగుడు సత్యనారాయణ తెలిపారు. చేనేతకు శాశ్వత రక్షణ అనే అంశంపై నిర్వహించనున్న సదస్సు కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. బాలకృష్ణ, టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర నాయకులు జి.వి.నాగేశ్వరరావు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. శివ దుర్గారావు, ఏఐటీయూసీ బాపట్ల జిల్లా సమితి నాయకులు జి. బాలాజి, జెడ్పీటీసీ సభ్యురాలు టి. ఉదయభాస్కరి పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు సొసైటీ మాజీ అధ్యక్షుడు బి. నాగమల్లేశ్వరరావు, నాయకుడు ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు కిందపడి వివాహిత మృతి

చీరాల రూరల్: గుర్తు తెలియని రైలు కిందపడి వివాహిత మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్. కొండయ్య వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన షేక్ కాలేషా, మల్లిక (30)లకు 11 ఏళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. కాలేషా పనులకు వెళ్లకుండా నిత్యం మద్యం తాగుతూ తిరుగుతుంటాడు. అతని ఆగడాలను భరించలేని మల్లిక నాలుగేళ్లుగా దూరంగా ఉంటోంది. కుటుంబ పోషణ నిమిత్తం బీడీలు చుట్టేందుకు కూలీ పనులకు వెళ్తోంది. పరిస్థితులతో జీవితంపై విరక్తి చెందిన ఆమె వేటపాలెం రైల్వే స్టేషన్‌కు సమీపంలోని రావూరి గేటు వద్ద విజయవాడ వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకం

- ఏఐకేఎఫ్ మహాసభలో పలు తీర్మానాలు ఆమోదం
- రెండురోజులపాటు కొనసాగిన సభ



మహాసభలో పాల్గొన్న నాయకులు

నరసరావుపేట: రైతుల సంక్షేమానికి వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎఫ్) గౌరవాధ్యక్షులు తూమాటి శివయ్య పేర్కొన్నారు. స్థానిక బరంపేట వినాయక దేవాలయం ఎదురుగా ఉన్న అమరజీవి కందికొండ కుమారస్వామి హాలులో మాచవరపు నాగేశ్వరరావు అధ్యక్షతన గురు, శుక్ర వారాల్లో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా మహాసభలలో పాల్గొని మాట్లాడారు. అన్నదాతలు హక్కులు, కోర్కెలు సాధన కోసం దేశ వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, ఎస్‌కేయం పోరాటాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నాయని, అందులో ఏఐకేఎఫ్ శ్రేణులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు షేక్ మొహిద్దిన్‌బాషా (రెడ్‌బాష) మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్నదాతల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని అన్నారు. వీటి పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తామన్నారు. ఏఐసీటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ ఖాదర్ బాష, జిల్లా కార్యదర్శి అమర్తలూరి వెంకటేశ్వరరావు, ఏంసీపీఐ కృష్ణాజిల్లా సయ్యద్ సలీం మాట్లాడారు.

పలు తీర్మానాలు ఆమోదం

గుంటూరు, పల్నాడు, బాపట్ల ఏరియాలలో ఉన్న మిగులు బంజరు ఫారెస్ట్ భూములు, దేవాదాయ, ధర్మాదాయ భూములు, సముద్ర తీర ప్రాంత భూములు పాలకవర్గ పార్టీలకు వెన్నుదన్నుగా ఉన్న కబ్జాదారులు కబంధ హస్తాలలో ఉన్నాయని, వాటిని విడిపించి పేద చిన్న, సన్నకారు పేదప్రజలకు పంపిణీ చేయాలని, కేవలం రూ.256 కోట్ల ఖర్చుతో 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే ముఖ్యమైన నీటిపారుదల ప్రాజెక్టు గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించి తక్షణమే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని, వరికెపుడిశెల ప్రాజెక్టు పూర్తి చేయాలని, సంయుక్త కిసాన్ మోర్చా రైతాంగ హక్కులు కోరికల కోసం సాగిస్తున్న ఆందోళన ఉద్యమాలను భాగస్వామ్యం కావాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించడం చేసింది.

నూతన జిల్లా కమిటీ సభ్యులు

ఉమ్మడి గుంటూరు జిల్లా ఏఐకేఎఫ్ అధ్యక్షులుగా ఉన్నం రత్నం, ఉపాధ్యక్షులుగా బాగా రమేష్, ప్రధాన కార్యదర్శి తూమాటి మణికంఠేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మాచవరపు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన సచ్చిదానంద మూర్తి



జ్యోతిని వెలిగిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన ఘనత పద్మవిభూషణ్ సచ్చిదానంద మూర్తికి దక్కుతుందని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాలను వారం రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కార్యక్రమాలు నిర్వహించారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. సచ్చిదానంద మూర్తి తత్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా వివరించారన్నారు. ఆధునిక యుగంలో విద్యార్థులు ఆ బోధనలను అనుసరించాలని కోరారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ.. సచ్చిదానంద మూర్తి నేటి తరానికి స్ఫూర్తి అన్నారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థులకు బహుమతులు అందించిన డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తదితరులు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ఈ నెల 14వ తేదీ నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించామని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం ఆధ్వర్యంలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుభ్రతపై అవగాహన పెంచేందుకు వినూత్నంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అత్తపై హత్యాయత్నం కేసులో జైలు వార్డెన్ అరెస్టు

తాడికొండ: గ్యాస్ లీక్ చేసి అత్తను హత్య చేయాలని భావించిన కేసులో కడప సెంట్రల్ జైలు వార్డెన్‌గా పనిచేస్తున్న మహేష్‌ను అరెస్టు చేశారు. అతడికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తుళ్ళూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. హైకోర్టులో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న కాకినాడకు చెందిన సుంకల భువనేశ్వరికి, అదే జిల్లాకు చెందిన కడప సెంట్రల్ జైల్ వార్డెన్ కె.మహేష్‌తో ఈ ఏడాది వివాహం జరిగింది. గొడవల కారణంగా మహేష్ దూరంగా ఉంటున్నాడు. ఉద్యోగ రీత్యా తల్లితో కలిసి రాయపూడిలో నివాసం ఉంటున్న భువనేశ్వరి ఇంటి వద్దకు గత నెల 22న మహేష్ వచ్చాడు. ఇంటిలో ఉన్న అత్త సాయి కుమారిని గ్యాస్‌ను లీక్ చేసి నిప్పంటించి కాల్చి చంపేందుకు యత్నం చేశాడు. భువనేశ్వరి ఫిర్యాదు మేరకు తుళ్ళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో ప్రవేశ పెట్టారు. కోర్టు 14 రోజుల రిమాండ్‌కు పంపించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పౌరసరఫరాల శాఖ కార్మికుల మెరుపు సమ్మె

- రెండు గంటలపాటు పనులు నిలిపివేత
- ప్రజా పంపిణీ వ్యవస్థలో నిలిచిన సరుకు రవాణా



లక్ష్మీపురం: సివిల్ సప్లయిస్ ముఠా కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేపట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. గుంటూరు ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని సివిల్ సప్లయిస్ గోదాముల కార్మికులు కూలీ రేట్ల జీవోను విడుదల చేయాలంటూ నిరవధిక సమ్మెను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. దీంతో ఎక్కడి లారీలు అక్కడ నిలిచి పోయాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఠా కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని అన్నారు. వారు గంట సమ్మె చేస్తేనే ఎక్కడి పని అక్కడే నిలిచిపోయిందని, నిరవధిక సమ్మెలోకి వెళితే ప్రజా పంపిణీ వ్యవస్థ స్తంభించిపోయి ఇబ్బందులు ఎదురవుతాయనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి కూలీ రేట్ల జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర నాయకులు జి. సురేష్ బాబు మాట్లాడుతూ.. పెరిగిపోతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని కూలీ రేట్లు పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా అధ్యక్షుడు కోట్ల మరియదాసు, దానం, కాంతారావు, వినుకొండ డేవిడ్, సురేష్, జాన్ బాబు, బుజ్జి, కిరణ్, మరియబాబు పాల్గొన్నారు.

విద్యార్థినిని కొట్టిన టీచర్

చార్జి మెమో జారీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థినిని ఓ ఉపాధ్యాయురాలు అకారణంగా కొట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. గుంటూరు సంజీవయ్యనగర్‌లోని పినపాటి ప్రభుదాస్ నగరపాలక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని తేజస్విని బాయి క్లాస్ లీడర్‌గా ఉంది. ఈ నెల 25వ తేదీన పాఠ్యాంశాలను బోధించేందుకు హిందీ ఉపాధ్యాయురాలు రంజాన్ బీ వచ్చారు. అప్పటికే కాస్త ఆలస్యం కావడంతో విద్యార్థులు అల్లరి చేస్తున్నారనే కారణంగా తేజస్విని బాయి మరొక ఉపాధ్యాయుడిని క్లాస్ తీసుకోవాల్సిందిగా అభ్యర్థించింది. తాను వచ్చే సమయానికి ఇలా చేసినందుకు తేజస్విని బాయిపై రంజాన్ బీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెత్తంతో కొట్టారు. విషయం తెలుసుకున్న గిరిజన సంఘాల నాయకులు గురువారం జేసీ భార్గవ్ తేజను కలెక్టరేట్‌లో కలిసి దీనిపై ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో డీఈవో పి.శైలజ స్పందించారు. డీవైఈవో పి. వెంకటేశ్వరరావును పాఠశాలకు పంపి విచారణ చేయించారు. డీవైఈవో నివేదిక ఆధారంగా శుక్రవారం చార్జి మెమో ఫైల్ చేశారు. డీఈవోను వివరణ కోరగా.. ఉపాధ్యాయురాలి తప్పిదం ఉన్నట్లు తేలిందన్నారు. చార్జి మెమో ఇచ్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు(వేమూరు): కొల్లూరు మండలంలోని గాంధీనగర్ చివరనున్న పాత రైతు భరోసా కేంద్రంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. నిందితుల నుంచి రూ. 40వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట ఆడితే పార్టీలకు సంబంధం లేకుండా అరెస్టు చేసి, చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇద్దరు సీఐలు, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

నగరంపాలెం: గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ పీఎస్ సీఐ ఎం.రాంబాబు, గుంటూరు డీసీఆర్‌బీ సీఐ బిలాలుద్దీన్, కానిస్టేబుళ్లు షేక్ చాంద్‌బాషా, షేక్ నూరుల్లాలను సస్పెండ్ చేశారు. అవినీతి ఆరోపణలు, కుటుంబ వివాదంలో జోక్యం చేసుకున్నారనే బాధితుల ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టారు. అవి నిజమని నివేదికలను ఐజీకి అందాయి. ఈ మేరకు ఇద్దరు సీఐలు, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.

నార్త్ జోన్, సౌత్ జోన్ మ్యాచ్ డ్రా

నార్త్ జోన్‌కు 9, సౌత్ జోన్‌కు ఆరు పాయింట్లు



టి.అచ్యుతహేమంత్, 4వికెట్లు, నార్త్‌జోన్

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలో భాగంగా నార్త్‌జోన్, సౌత్‌జోన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నార్త్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు నష్టానికి 259 పరుగులు చేసింది. నిన్నటి ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 66 పరుగుల స్కోర్‌తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్‌జోన్ 194 పరుగులు చేసింది. జట్టులోని యోగానంద్ 67 పరుగులు సాధించాడు. నార్త్‌జోన్ బౌలర్లు టి.అచ్యుతహేమంత్ 4, ఎం.రవికిరణ్ మూడు వికెట్లు సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్‌జోన్ ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లు నష్టానికి 133 పరుగులు చేసింది. జట్టులోని జి.సాయిపూర్ణతేజ 31, ప్రసాద్ 34 పరుగులు చేశారు. అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించిన నార్త్‌జోన్‌కు 9, సౌత్‌జోన్‌కు ఆరు పాయింట్లు కేటాయించారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

టెక్స్‌టైల్స్ మిల్స్‌ను ఆదుకోవాలి



కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. అసోసియేషన్ కోశాధికారి పి.చలపతిరావు 2023–24 సంవత్సరం జమ, ఖర్చులను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.కోటిరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సభ్యులకు ఇవ్వాల్సిన రూ.1,400 కోట్లు విడుదల చేసి పరిశ్రమలను ఆదుకోవాలని కోరారు. గౌరవ చైర్మన్ లంకా రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. నూతన టెక్స్‌టైల్ పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫైర్ అండ్ విపత్తుల శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సామినేటి కోటేశ్వరరావు, సత్యనారాయణ, సూర్యప్రకాశరావు, రవీంద్రనాథ్, బెనర్జీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ



ప్రకాశరావు



అనంతరాజు



పరంధామరెడ్డి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్లోరియా

బాపట్ల: జిల్లాలో పలువురు అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆర్డీఓగా పి.గ్లోరియా, జిల్లా రవాణాశాఖ అధికారిగా తేతలి కృష్ణ పరంధామరెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈగా ఎం.అనంతరాజు, ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారిగా ప్రకాశరావు బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందించారు.

లడ్డూకు రాజకీయ రంగు సిగ్గుచేటు

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సునీల్



చినగంజాం: సనాతన ధర్మం పాటించే వ్యక్తిగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని బాపట్ల జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మేడికొండ సునీల్ శుక్రవారం ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. లడ్డూకు కేవలం రాజకీయం కోసం రంగులు మార్చి మాట్లాడటం సిగ్గుచేటని ఖండించారు. ఒక్క హిందువు ఓటు వేస్తే కూటమి గెలవలేదని క్రైస్తవులు, ముస్లింలు కూడా వేస్తే గెలిచారని తెలిపారు. సనాతన ధర్మం పాటించే వాడివి అయితే పిల్లల పేర్లు మార్చి హిందూత్వంలోకి రావాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం కులం లేదు.. మతం లేదు అంటూ క్రిస్మస్‌కు జెరూసలేం, బక్రీద్‌కు మసీదుకు వెళ్లి బీఫ్ బిర్యాని తింటున్నారని ఎద్దేవా చేశారు. నేడు సనాతన ధర్మం అంటూ హిందువులు బయటకు రావాలని పవన్ కల్యాణ్ రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన మంచి చేస్తాడని ప్రజలు ఓట్లు వేశారని, ఇప్పుడు కులాల మధ్య చిచ్చు పెట్టి రాష్ట్రాన్ని రావణ కాష్టంగా చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ప్రయత్నాలెన్నో కూటమి ప్రభుత్వం చేస్తుందని, ప్రజలు సంయమనంతో ఉంటూ ఐకమత్యంతో మెలగాలని సునీల్ సూచించారు.

కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తాం

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు ఎడ్యుకేషన్: నగర సమగ్ర ప్రగతికి దాతల సహకారంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చుట్టుగుంట, ఏటీ అగ్రహారం, కేవీపీ కాలనీ, జోసఫ్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. వెంట స్థానిక ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల భారీ వర్షాలకు నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇలాంటి నీటిని సజావుగా బయటకు పంపేందుకు జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాతల సహకారంతో నగర సమగ్రాభివృద్ధికి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పలు ప్రాంతాల్లోని కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాల్సి ఉందన్నారు. వీరిలో కొందరు పేదలు ఉన్నారని, అర్హులైన వారికి నష్ట పరిహారంతోపాటు ప్రత్యామ్నాయం చూపిస్తామని తెలిపారు. శంకర్ విలాస్ సెంటర్‌లోని ఆర్వోబీ విస్తరణ గుంటూరు ప్రజల 30 ఏళ్ల కల అని, దీని నిర్మాణానికి కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. డీపీఆర్ అందించామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ జోసఫ్ నగర్ చంద్రభానుడిగుంట చెరువు ఇటీవల వర్షాలకు పొంగి సుమారు 600 నివాసాల్లో నీరు చేరిందన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. త్వరలో చెరువుకు కట్ట నిర్మాణం చేపడతామన్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని చెరువులు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడలకు ప్రాధాన్యం అవసరం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న సువేందు శేఖర్‌దాసు

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ విద్యా విధానంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు, ఆటలు విద్యార్థులకు అవసరమని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్ఈ స్కూల్స్ ప్రాంతీయ అధికారి సువేందు శేఖర్‌దాసు పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సీబీఎస్ఈ క్లస్టర్–7 క్రీడా పోటీల్లో భాగంగా బాలుర బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. నగరంలోని పాఠశాలలు సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే విద్యార్థులు సమగ్రంగా అభివృద్ధి సాధించగలరని అన్నారు. అండర్–14, 17, 19 విభాగాల్లో పోటీలు రెండు రోజులపాటు జరగనున్నాయి. పారా ఒలింపియన్ సైక్లిస్ట్–2024 షేక్ హర్షద్, డీఈవో పి.శైలజ, కేఎల్‌పీ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, శ్రీపాటిబండ్ల సీతారామయ్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, వేంకటేశ్వర బాలకుటీర్ సీఏవో రఘురాం, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్ సుధామాధవి (బాలకుటీర్), ఎస్.నర్మద (శ్రీచైతన్య), గిరిజారాణి (భాష్యం), సుజాత (టాప్‌కిడ్స్), జి.రత్తయ్య (కేఎల్‌పీ), జంపని పద్మజ (సీతారామయ్య స్కూల్) పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం ఉచిత సీటుకు ఫీజు డిమాండ్

- గుంటూరులోని సెయింట్ లూక్స్ స్కూల్‌పై ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన డీఈవో శైలజ
- కరస్పాండెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థి నుంచి ఫీజు డిమాండ్ చేశారనే ఆరోపణలతో నెహ్రూనగర్‌లోని సెయింట్ లూక్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కొఠార శంకరరావుకు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. వివరాలు.. గుంటూరుకు చెందిన టి. రవిశంకర్ తన కుమార్తె త్రైలోక్య నందినిని నిర్బంధ విద్యాహక్కుచట్టం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, నెహ్రూనగర్ 4వ లైనులోని సెయింట్ లూక్స్ పాఠశాలలో చేర్పించారు. నిబంధనల మేరకు సంబంధిత విద్యార్థినికి ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంది. కానీ దాంతో తమకు సంబంధం లేదని, నిర్ణయించిన ప్రకారం ఫీజు చెల్లించాలని ఒకటో తరగతిలో చేరిన చిన్నారిని తరగతి గదిలో నిలిపి పాఠశాల కరస్పాండెంట్ కొఠారి శంకరరావు అడిగారు. దీనిపై విద్యార్థిని తండ్రి రవిశంకర్ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఈవో.. శుక్రవారం గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావును పాఠశాలకు పంపి విచారణ చేయించారు. ఉచిత సీటుకు ఫీజు డిమాండ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని, విద్యార్థినికి ఉచితంగా చదువు చెప్పాలని ఆదేశిస్తూ కరస్పాండెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కరస్పాండెంట్ వ్యవహారశైలిపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు గతంలోనే చాలాసార్లు విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫీజుల పేరిట విద్యార్థులను తరగతి గదిలో గంటల తరబడి నిలబెట్టడంతోపాటు తల్లిదండ్రులను క్యాంపస్‌లోనికి అనుమతించకపోవడం వంటి ఘటనలు ఇక్కడ జరిగాయి.

గడువులోగా ఐటీ రిటర్న్ దాఖలు చేయండి



మాట్లాడుతున్న ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి రామశాస్త్రి

నరసరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు సెక్షన్ 80పి కింద ఆదాయపు పన్ను రాయితీ పొందేందుకు నిర్ణీత గడువులోగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలని నరసరావుపేట ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ ఎం.రామశాస్త్రి అన్నారు. స్థానిక జీడీసీసీ బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ప్రిన్సిపల్ కమిషన్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ విజయవాడ, అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ గుంటూరు ఆదేశాల మేరకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో రామశాస్త్రి మాట్లాడుతూ గడువు దాటిన తర్వాత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సెక్షన్ 80పి కింద రాయితీ వర్తించదన్నారు. ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం నుంచి వచ్చే తాఖీదులకు వెంటనే స్పందించి జవాబు ఇవ్వాలన్నారు. ఆదాయపు పన్ను శాఖ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ రూ.2 లక్షలకు లోబడి నగదు లావాదేవీలు ఉండాలన్నారు. సదస్సులో జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, ఆదాయపన్ను శాఖ సూపరింటెండెంట్ ఎస్‌కె. హమానుల్లా, స్థానిక జీడీసీసీ చీఫ్ మేనేజర్ బ్యాంక్ మేనేజర్ ఎస్.రమాదేవి, పల్నాడు జిల్లాలోని సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో నిందితులు

నరసరావుపేట టౌన్: అక్రమంగా గంజాయి కలిగిన కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకొని నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ హైమారావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. సత్తెనపల్లిరోడ్డులోని చంద్రబాబునాయుడు కాలనీలో దాడులు నిర్వహించి అక్రమంగా గంజాయి కలిగి ఉన్న ఉప్పుతోళ్ల తిరుపతిరావును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.